www.kalamjyothi.com

కలంజ్యోతి

తెలుగు దినపత్రిక

శనివారం
07.11.2026

- ముందస్తు టికెట్ బుకింగ్‌తో క్యూలైన్ల తిప్పలు దూరం
- రూట్ మ్యాప్‌లు, సర్వీసుల వేళలన్నీ ఒక్క క్లిక్‌తో పరిశీలన
- సోషల్ మీడియా ద్వారా తాజా సమాచారం, హెచ్చరికలు
- సమస్యలు, ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక వెసులుబాటు
- ప్రయాణ సమయం ఆదా కావడంపై ప్రయాణికుల హర్షం



ఉమ్మడి పాస్ మరింత చౌక!


- నెల పాసులో గరిష్ఠంగా 50 రౌండ్ ట్రిప్పులు
- ఓఆర్ఆర్ పరిధిలోని సిటీ బస్సులకే అనుమతి
- శంషాబాద్ పుష్పక్ ఏసీ సర్వీసులకు వర్తించదు
- స్మార్ట్ కార్డుకు రూ. 100 సెక్యూరిటీ డిపాజిట్
- మెట్రో కౌంటర్లలోనే కార్డుల విక్రయం, రీఛార్జ్
- కార్డు పోయినా, దొంగిలించబడినా ప్రయాణికుడిదే బాధ్యత

3 లో..

హైదరాబాద్ నగర ప్రయాణికులకు ఊరట కల్పిస్తూ ఉమ్మడి బస్, మెట్రో కామన్ పాస్ ధరలను తెలంగాణ ప్రభుత్వం భారీగా తగ్గించింది. గతంలో రూ. 8,500గా ఉన్న నెలవారీ పాస్ ధరను రూ. 4,000కు, రూ. 400గా ఉన్న వన్ డే పాస్ ధరను రూ. 275కు కుదించింది. అయితే, ఈ పాస్ కేవలం ఓఆర్ఆర్ పరిధిలోని టీజీఎన్ ఆర్టీసీ సిటీ బస్సులు, మెట్రో రైళ్లకు మాత్రమే పరిమితమని, పుష్పక్ ఏసీ సర్వీసులకు వర్తించదని అధికారులు స్పష్టం చేశారు. పలు కీలక నిబంధనలతో కూడిన ఈ సవరించిన నూతన ధరలు శనివారం నుంచే అమలులోకి రానున్నాయి.

కలంజ్యోతి, బ్యూరో (నవంబర్ 06)





2 లో

క్యూఆర్ స్కాన్‌తో అరచేతిలోకి సేవలు

లైవ్ ట్రాకింగ్‌తో బస్సుల రాక సులభంగా తెలుసుకోవచ్చు

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ ఆర్టీసీ) ప్రయాణికులకు అత్యాధునిక సాంకేతిక సేవలను చేరువ చేస్తూ విప్లవాత్మక డిజిటల్ ముందడుగు వేసింది. ప్రయాణికుల సౌకర్యార్థం సరికొత్తగా ఆధునీకరించిన ఆల్ ఇన్‌వన్ క్యూఆర్ (QR) కోడ్ విధానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ ఒక్క క్యూఆర్ కోడ్‌ను మొబైల్ తో స్కాన్ చేయడం ద్వారా బస్సుల లైవ్ ట్రాకింగ్, ముందస్తు ఆన్‌లైన్ టికెట్ రిజర్వేషన్, సమగ్ర బస్సు వేళలు, సంస్థ అధికారిక సోషల్ మీడియా అకౌంట్ల వివరాలన్నీ ప్రయాణికుల అరచేతిలోకి రానున్నాయి. క్యూలైన్లలో నిలబడే శ్రమ తప్పించడంతో పాటు సమయాన్ని ఆదా చేసే ఈ సరికొత్త విధానంపై ప్రయాణికుల నుంచి విశేష స్పందన లభిస్తోంది.

కలంజ్యోతి బ్యూరో, (నవంబర్ 06)

రాష్ట్రంలో ఉన్నది రేవంత్ వృష్టి

- నదుల్లో పుష్కలంగా నీళ్లున్నా పంటలు ఎండబెట్టారు
- మిగతా గోదావరి నీళ్లను పట్టిసీమకు వదిలేశారు
- ఎకరానికి రూ.5 వేల కరువు సాయం ఇవ్వాలి
- రైతుబంధు పడ్డట్లు సీఎం పేరుతో ఫేక్ మెసేజ్‌లు
- సన్నాలకు బోనస్ ఎగ్గొట్టేందుకే కొనుగోళ్లలో జాప్యం
- తాగునీరు బంద్ చేసి బీరు కంపెనీలకు నీళ్లిస్తారా?
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్‌రావు

4 లో



కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థ విధానాల వల్ల రాష్ట్రంలో తీవ్ర కరువు పరిస్థితులు దాపురించి, సాగునీరు అందక చేతికొచ్చిన వరి పంటలు కళ్లముందే ఎండిపోతున్నాయని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు ధ్వజమెత్తారు. నర్సాపూర్ నియోజకవర్గ పరిధిలోని హత్నూర మండలం తెలరాళ్ల తండా, నస్తీపూర్ గ్రామాల్లో ఎండుతున్న వరి పొలాలను స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, తెలంగాణలో ప్రస్తుతం ఉన్నది అతివృష్టి, అనావృష్టి కాదని, ముమ్మాటికీ రేవంత్ వృష్టేనని మండిపడ్డారు. నదుల్లో పుష్కలంగా నీరున్నా మోటార్లు ఆన్ చేయకుండా పంటలను ఎండబెట్టి రైతుల పొట్ట కొట్టారని, తక్షణమే ఎకరానికి రూ. 5,000 కరువు సాయం అందించి రైతాంగాన్ని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

- కలంజ్యోతి, నర్సాపూర్ (నవంబర్ 07)



కలంజ్యోతి
తెలుగు దినపత్రిక
2
శనివారం 07.11.2026
www.kalamjyothi.com


క్యూఆర్ స్కాన్‌తో అరచేతిలోకి సేవలు



కలంజ్యోతి, హైదరాబాద్ (నవంబర్ 06) : మారుతున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ ఆర్టీసీ) ప్రయాణికుల కోసం సరికొత్త డిజిటల్ సేవలను అందుబాటులోకి తెచ్చింది. 'ప్రగతి రథం ప్రజా సేవా పథం' ధ్యేయంగా పనిచేస్తున్న సంస్థ, స్మార్ట్‌ఫోన్ ద్వారా ఒక్క క్యూఆర్ (QR) కోడ్ స్కాన్‌తోనే సంస్థకు సంబంధించిన సమస్త సేవలను పొందే ప్రత్యేక సదుపాయాన్ని రూపొందించింది. గతంలో ఉన్న విధానాన్ని మరింత ఆధునీకరించి ప్రయాణికులకు అందించింది. ప్రయాణికులు తమ మొబైల్ కెమెరాతో ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయగానే, ఆర్టీసీకి చెందిన వివిధ డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లు, అధికారిక అప్లికేషన్ల లింక్‌లు నేరుగా ఫోన్ స్క్రీన్‌పై కనిపిస్తాయి.

లైవ్ ట్రాకింగ్ నుంచి టికెట్ బుకింగ్ వరకు అన్నీ సులభం..

ఈ ఒక్క క్యూఆర్ కోడ్ స్కాన్‌తో ప్రయాణికులకు బహుళ ప్రయోజనాలు చేకూరనున్నాయి. బస్సు ఎక్కడుందో తెలుసుకునే లైవ్ ట్రాకింగ్ విధానం ద్వారా బంధువులు, ప్రయాణికులు ఏ సమయానికి గమ్యస్థానానికి చేరుకుంటారో కచ్చితంగా తెలుసుకోవచ్చు. అధికారిక బుకింగ్ యాప్ ద్వారా ముందస్తు టికెట్ రిజర్వేషన్ సులభంగా చేసుకోవచ్చు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ రూట్లలో నడిచే ఎక్స్‌ప్రెస్, డీలక్స్, సూపర్‌లగ్జరీ తదితర సర్వీసుల వేళలు, రూట్ మ్యాప్‌లను పరిశీలించే వెసులుబాటు కల్పించారు. సంస్థ ఎప్పటికప్పుడు అందించే సమాచారం, తాజా హెచ్చరికలను ఎక్స్ (ట్విట్టర్), ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, యూట్యూబ్, వాట్సాప్ ఛానళ్ల ద్వారా ఒకే క్లిక్‌తో తెలుసుకునే అనుసంధానాన్ని కల్పించారు.



ప్రయాణికుల సలహాలు, ఫిర్యాదులకూ ప్రత్యేక అవకాశం..

సంస్థ సేవల నాణ్యతను మరింత పెంచేందుకు ప్రయాణికులు తమ విలువైన సలహాలు, సూచనలు అందించడంతో పాటు ప్రయాణంలో ఎదురయ్యే సమస్యలపై ఫిర్యాదులు చేసేందుకు సోషల్ మీడియా లింకులు తోడ్పడతాయి. వినియోగదారులు తమ ఈమెయిల్ ఐడీ, పాస్‌వర్డ్‌తో ఒకసారి ఖాతా తెరిస్తే ఈ సేవలన్నింటినీ నిరంతరం వినియోగించుకోవచ్చు. ఆర్టీసీ తీసుకొచ్చిన ఈ సరికొత్త క్యూఆర్ కోడ్ విధానంతో రిజర్వేషన్ కేంద్రాల వద్ద క్యూలైన్లలో నిలబడే శ్రమ తప్పి, సమయం ఆదా అవుతోందని ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పరీక్ష ఫీజుల చెల్లింపుతో భరోసా


- పేదరికం ప్రతిభకు అడ్డంకి కాకూడదు
- పరీక్షల సమయంలో పిల్లలపై ఒత్తిడి తేవద్దు
- కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్



కలంజ్యోతి, ఎల్లారెడ్డిపేట (నవంబర్ 05) : పేద విద్యార్థుల చదువుకు పరీక్ష ఫీజులు ఆర్థిక భారంగా మారకూడదనే సంకల్పంతో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడు బండి సంజయ్ కుమార్ పదో తరగతి విద్యార్థుల పరీక్ష ఫీజులను చెల్లించి తన ఉదారతను చాటుకున్నారు. గత ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల పరీక్ష ఫీజులను ఆయన స్వయంగా భరించారు. రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, జగిత్యాల, సిద్దిపేట, హనుమకొండ జిల్లాల్లోని ప్రభుత్వ పాఠశాలలకు చెందిన మొత్తం 10,959 మంది విద్యార్థుల పరీక్ష ఫీజుల మొత్తాన్ని సంబంధిత జిల్లా విద్యాశాఖ అధికారులకు (డీఈఓలకు) అందజేశారు. పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులపై ఆర్థిక భారం పడకుండా, డబ్బుల కొరతతో ఏ ఒక్కరూ పరీక్షలకు దూరం కాకూడదనే లక్ష్యంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

పిల్లలపై ఒత్తిడి తేవద్దు..

పరీక్షల సమయంలో విద్యార్థుల తల్లిదండ్రులు పిల్లలపై ఎలాంటి మానసిక ఒత్తిడి తీసుకురావద్దని, వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేలా వ్యవహరించాలని బండి సంజయ్ కుమార్ విజ్ఞప్తి చేశారు. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో చదువుకుని మంచి ఫలితాలు సాధించేలా ప్రోత్సహించాలని, వారి ఉజ్వల భవిష్యత్తుకు కుటుంబ సభ్యులంతా అండగా నిలవాలని కోరారు. ఆర్థిక పరిస్థితులు విద్యార్థుల చదువుకు అడ్డంకిగా మారకూడదనే ఆలోచనతో వేలాది మంది విద్యార్థుల పరీక్ష ఫీజులను కేంద్ర మంత్రే స్వయంగా భరించడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. రాజకీయాలకు అతీతంగా పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి తోడ్పాటు అందిస్తూ విద్యార్థుల భవిష్యత్తుకు కొండంత ఆర్థిక భరోసా కల్పించారని పలువురు కొనియాడారు.



నిర్మల్‌లో 11న రైతు గర్జన సభ

పోస్టర్ ఆవిష్కరించిన నాయకులు

కలంజ్యోతి, నిర్మల్ (నవంబర్ 06): ఈ నెల 11న నిర్మల్‌లో నిర్వహించనున్న బీఆర్ఎస్ రైతు గర్జన సభకు పార్టీ నాయకులు సన్నాహాలు ముమ్మరం చేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆధ్వర్యంలో నిర్మల్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో జరగనున్న ఈ సభకు సంబంధించిన పోస్టర్‌ను శుక్రవారం పార్టీ నాయకులు ఆవిష్కరించారు. అనంతరం సభా ప్రాంగణానికి చేరుకుని ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రైతు గర్జన సభను విజయవంతం చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు, సభా ప్రాంగణంలో చేపట్టాల్సిన సౌకర్యాలు, ఇతర నిర్వహణ అంశాలపై నాయకులు పరిశీలించారు. నిర్మల్, ముధోల్, ఖానాపూర్ నియోజకవర్గాల నుంచి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా సమన్వయం చేసుకోవాలని చర్చించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి, ఎమ్మెల్యే అనిల్ జాదవ్, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, నిర్మల్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాంకిషన్ రెడ్డి పాల్గొన్నారు. అలాగే ముధోల్ నియోజకవర్గ సమన్వయకర్తలు లోలం శ్యాంసుందర్, రమాదేవి, కిరణ్ కోమ్రేవార్, విలాస్ గాదేవర్, నిర్మల్ నియోజకవర్గ నాయకుడు నల్ల వినయ్ రెడ్డితో పాటు మూడు నియోజకవర్గాలకు చెందిన ముఖ్య నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.

నేడు కొడంగల్‌కు సీఎం రేవంత్‌రెడ్డి

- మూడు రోజుల పాటు నియోజకవర్గంలో పర్యటన
- రూ. 9,100 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం

కలంజ్యోతి, హైదరాబాద్ (నవంబర్ 06) : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం నుంచి మూడు రోజుల పాటు తన సొంత నియోజకవర్గమైన కొడంగల్‌లో విస్తృతంగా పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా కొడంగల్, కోస్గి ప్రాంతాల్లో దాదాపు రూ. 9,100 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. తొలిరోజు దుద్యాల మండలం హకీంపేటలోని యంగ్ ఇండియా ఎడ్యుకేషన్ హబ్ ప్రాంగణంలో 150 స్థాళ్లతో ఏర్పాటు చేసిన మెగా రైతు మేళా, ఇండస్ట్రియల్ ఎక్స్‌పోను సీఎం ప్రారంభిస్తారు. అనంతరం ఆదర్శ రైతులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, పారిశ్రామికవేత్తలతో ముఖాముఖి సమావేశమై చర్చిస్తారు. ఎడ్యుకేషన్ హబ్ నిర్మాణ పనులను పరిశీలించిన అనంతరం కొడంగల్‌లోని తన నివాసానికి చేరుకుని రాత్రి అక్కడే బస చేస్తారు.

రూ. 9,100 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం..

రెండో రోజైన నవంబర్ 8న నియోజకవర్గవ్యాప్తంగా పర్యటించి రూ. 46.08 కోట్ల విలువైన ప్రభుత్వ భవనాలను ప్రారంభించడంతో పాటు పలు మెగా ప్రాజెక్టులకు శంకుస్థాపనలు చేస్తారు. మహిళా సంఘాలతో సమావేశం అనంతరం లగచర్ల ఇండస్ట్రియల్ కారిడార్‌లో రూ. 81 కోట్లతో నిర్మించనున్న ఎకోపామ్ పామాయిల్ ఫ్యాక్టరీకి, రూ. 5,060 కోట్ల వ్యయంతో చేపట్టనున్న కొత్వాల్‌గూడనాచారం రేడియల్ రోడ్డు 2 పనులకు శంకుస్థాపన చేస్తారు. నాట్కో నిధులతో నిర్మించిన పాఠశాల, కళాశాల భవనాలు, పీహెచ్‌సీతో పాటు బొంరాస్‌పేట, కొడంగల్, దుద్యాల్‌లో నూతన పోలీస్ స్టేషన్లు, సమీకృత మండల కార్యాలయ భవనాలను ప్రారంభిస్తారు. అలాగే కోస్గి పట్టణంలో నిర్మించిన సైన్స్ మ్యూజియాన్ని సీఎం ప్రారంభించనుండగా, ఎస్పీ డాక్టర్ వినీత్ శుక్రవారం భద్రతా ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించారు.

9న హకీంపేటలో భారీ రైతు బహిరంగ సభ..

పర్యటన చివరి రోజైన నవంబర్ 9న హకీంపేటలో నిర్వహించే భారీ రైతు బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొని ప్రసంగిస్తారు. రంగారెడ్డి, వికారాబాద్, మహబూబ్‌నగర్, సంగారెడ్డి, మెదక్ సహా 10 జిల్లాల నుంచి దాదాపు 50 వేల మంది రైతులు తరలివచ్చేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

గుండ్ల మాచూనూర్ సర్పంచ్ శ్రీహరి

కలంజ్యోతి, హత్తూర (నవంబర్ 06) : గ్రామంలో ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు అన్ని రకాల చర్యలు వేగవంతం చేశామని సర్పంచ్ శ్రీహరి స్పష్టం చేశారు. హత్తూర మండలం గుండ్ల మాచూనూర్ గ్రామంలోని ఎనిమిదో వార్డులో నీటి సమస్య తలెత్తడంతో, దాన్ని పరిష్కరించేందుకు నూతన పైప్‌లైన్ నిర్మాణ పనులను తన ఆధ్వర్యంలో ముమ్మరంగా చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. రానున్న రోజుల్లో ఎక్కడా తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో పైప్‌లైన్ల నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో గుర్తించి పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని చెప్పారు. గ్రామ పరిధిలోని పలు పరిశ్రమల సీఎస్ఆర్ నిధులతో లక్షల రూపాయల అభివృద్ధి పనులు చేపట్టి, గుండ్ల మాచూనూర్‌ను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడానికి తన వంతు కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ శంకర్, వార్డు సభ్యులు రమేష్, భద్రేజ్, తదితరులు పాల్గొన్నారు.



కలంజ్యోతి
తెలుగు దినపత్రిక
3
శనివారం 07.11.2026
www.kalamjyothi.com



బీఆర్ఎస్‌కి యువ వ్యాపార వేత్త

కలంజ్యోతి, నిర్మల్ (నవంబర్ 06) : నిర్మల్ జిల్లా లక్ష్మణ చాంద మండలం వడ్యాల్ కు చెందిన యువ వ్యాపారవేత్త నల్లా వినయ్ రెడ్డి బి ఆర్ ఎస్ లో చేరారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్ లో పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షులు కె టి ఆర్ సమక్షంలో పార్టీ కండువా కప్పుకున్నారు. పార్టీ ఆశయాలు, కెసిఆర్, కేటీ ఆర్ ల పని తీరుపట్ల ఆకర్షితుడై ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బోథ్ ఎంఎల్ఏ అనిల్ జాదవ్, నిర్మల్, ఖానాపూర్ సెగ్మెంట్ల ఇంచార్జీలు రాంకిషన్ రెడ్డి, జాన్సన్ నాయక్, మాజీ ఎంపీ బాల్క సుమన్, నిర్మల్ పట్టణాధ్యక్షుడు మారుగొండ రాము, మాజీ కౌన్సిలర్ అయ్యన్నగారి రాజేందర్ పాల్గొన్నారు.

బాధితుడికి పరామర్శ

ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్న
పెద్ది స్వప్న సుదర్శన్‌రెడ్డి

కలంజ్యోతి, చెన్నారావుపేట (నవంబర్ 06) : అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధిత కుటుంబాన్ని మాజీ జెడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న సుదర్శన్ రెడ్డి పరామర్శించి ధైర్యం చెప్పారు. చెన్నారావుపేట మండలంలోని కాల్ నాయక్ తండాకు చెందిన మాజీ సర్పంచ్ బాదావత్ వీరన్న తండ్రి బాదావత్ గొప్ప అనారోగ్యానికి గురై వరంగల్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రి లో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఆమె శుక్రవారం ఆసుపత్రికి వెళ్లి ఆయనను పరామర్శించారు. వైద్యులతో



మాట్లాడి అందుతున్న చికిత్స, ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్, మండల నాయకులు బోడ సమ్ము నాయక్, గుగులోతు సత్యం, తదితరులు పాల్గొన్నారు.




అమరవీరుల ఆశయ సాధనకు కృషి

సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ జిల్లా కార్యదర్శి కె. రాజన్న

కలంజ్యోతి, నిర్మల్ (నవంబర్ 06) : దోపిడీ వ్యవస్థ నిర్మూలనకై పోరాడి ప్రాణాలర్పించిన అమరవీరుల ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ జిల్లా కార్యదర్శి కె. రాజన్న పిలుపునిచ్చారు. ఈ నెల 10వ తేదీ వరకు నిర్వహించే అమరవీరుల సంస్మరణ దినాల్లో భాగంగా స్థానిక టీవీవీభవన్‌లో అమరవీరుల సంస్మరణ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటిస్తూ ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, దోపిడీ రహిత సమాజాన్ని నిర్మించాలనే ఉన్నతమైన లక్ష్యంతో తమ అమూల్యమైన ప్రాణాలను త్యాగం చేసిన ఎంతోమంది విప్లవ అమరవీరులను నిరంతరం స్మరించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. వారి ఆశయాల సాధన దిశగా ఉద్యమాలను ముందుకు తీసుకువెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామలక్ష్మణ్, గంగాధర్, సత్యం, శివలింగం, రాజేశ్వర్, నరేష్, నాయకులు పాల్గొన్నారు.

పంచాయితీల పేరుతో వసూళ్లకు పాల్పడితే చర్యలు

- న్యాయస్థానాల మాదిరిగా తీర్పులు ఇచ్చే అధికారం లేదు
- డిపాజిట్లు వసూలు చేస్తే బీఎన్ఎస్ చట్ట ప్రకారం కేసులు
- చట్టవిరుద్ధ పంచాయతీలకు ఫిర్యాదు చేయాలి
- చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే కేసులు నమోదు చేస్తాం
- చెన్నారావుపేట ఎస్ఐ పొన్నాల గోవర్ధన్





కలంజ్యోతి, చెన్నారావుపేట (నవంబర్ 06) : గ్రామాల్లో పంచాయతీల పేరుతో ప్రజల నుంచి అక్రమంగా డిపాజిట్లు వసూలు చేయడం, భారీగా జరిమానాలు విధించడం వంటి చట్టవిరుద్ధ చర్యలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని, బాధ్యులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెన్నారావుపేట ఎస్ఐ పొన్నాల గోవర్ధన్ తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. మండలంలోని పలు గ్రామాల్లో కొందరు వ్యక్తులు పెద్దమనుషుల ముసుగులో కట్టడి పంచాయతీలు నిర్వహిస్తూ అమాయక ప్రజలను భయాందోళనలకు గురిచేస్తున్నట్లు పోలీసుల దృష్టికి వచ్చిందని పేర్కొన్నారు. సమాజంలో శాంతిభద్రతలను కాపాడటానికి రాజ్యాంగం, న్యాయవ్యవస్థ ఉన్నాయని, ఎవరికి వారే న్యాయస్థానాల మాదిరిగా వ్యవహరిస్తూ తీర్పులు ఇవ్వడానికి, పెనాల్టీలు విధించడానికి ఎలాంటి చట్టబద్ధమైన అధికారం లేదని ఆయన చాలా స్పష్టంగా తేల్చిచెప్పారు.

డిపాజిట్లు వసూలు చేస్తే బీఎన్ఎస్ చట్ట ప్రకారం కేసులు..

డబ్బుల కోసం ప్రజలను మానసికంగా, శారీరకంగా వేధించడం, బెదిరింపులకు గురిచేయడం, మోసపూరితంగా వసూళ్లకు పాల్పడటం లాంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు. పంచాయతీల పేరిట దాడులకు దిగినా, గ్రామ బహిష్కరణలు వంటి అనాగరిక చర్యలకు పాల్పడినా చట్టాన్ని చేతుల్లోకి తీసుకున్న వ్లేనని తెలిపారు. ఇలాంటి అక్రమాలకు పాల్పడే వారిపై భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) లోని కఠిన సెక్షన్ల కింద నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేసి, వారిని రిమాండ్‌కు తరలిస్తామని హెచ్చరించారు. గ్రామాల్లో శాంతియుత వాతావరణానికి విఘాతం కలిగించే వ్యక్తులు ఎంతటి వారైనా చట్టం ముందు సమానులేనని, వారిపై కఠిన చర్యలు తప్పవని వివరించారు.

చట్టవిరుద్ధ పంచాయతీలకు భయపడకుండా ఫిర్యాదు చేయాలి..

గ్రామాల్లో ఎవరైనా సమస్యల పరిష్కారం పేరిట డిపాజిట్లు ఇవ్వాలని డిమాండ్ చేసినా, అక్రమంగా ఆర్థిక జరిమానాలు విధించినా బాధితులు ఏమాత్రం భయపడాల్సిన అవసరం లేదని ధైర్యం చెప్పారు. ఇటువంటి సంఘటనలు ఎదురైనప్పుడు బాధిత ప్రజలు ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే చెన్నారావుపేట పోలీస్ స్టేషన్‌కు వచ్చి రాతపూర్వకంగా ఫిర్యాదు చేయాలని సూచించారు.



గ్రామీణ ప్రజలంతా చట్టం, న్యాయ వ్యవస్థ కల్పించిన హక్కులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, సమాంతర న్యాయం పేరిట సాగే చట్టవిరుద్ధమైన పంచాయతీలకు లొంగిపోవద్దని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని, గ్రామాల్లో చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయడానికి పోలీసు యంత్రాంగానికి సహకరించాలని ఎస్ఐ పొన్నాల గోవర్ధన్ విజ్ఞప్తి చేశారు.

ఉమ్మడి పాస్ మరింత చౌక!

కలంజ్యోతి, హైదరాబాద్ (నవంబర్ 06) : హైదరాబాద్ నగర ప్రయాణికుల కోసం ప్రవేశ పెట్టిన ఉమ్మడి బస్, మెట్రో పాస్ ధరలను తెలంగాణ ప్రభుత్వం భారీగా కుదించింది. పలు కీలక నిబంధనలతో కూడిన ఈ సవరించిన నూతన ధరలు శనివారం నుంచి అధికారికంగా అమలులోకి రానున్నాయి. కొత్త మార్గదర్శకాల ప్రకారం, గతంలో రూ. 8,500గా ఉన్న నెలవారీ కామన్ పాస్ ధరను భారీగా తగ్గిస్తూ ఏకంగా రూ. 4,000గా నిర్ణయించారు. ఈ నెలవారీ పాస్‌పై ప్రయాణికులు నెలకు గరిష్టంగా 50 రౌండ్ ట్రిప్పుల వరకు ప్రయాణించే వెసులుబాటు కల్పించారు. అలాగే గతంలో రూ. 400గా ఉన్న ఒక రోజు ఉమ్మడి పాస్ ధరను రూ. 275కు తగ్గించగా, దీని ద్వారా రోజుకు గరిష్టంగా 4 సింగిల్ జర్నీలు చేసేందుకు అనుమతి ఉంటుంది.

ఓఆర్ఆర్ పరిధిలోని సిటీ బస్సులకే అనుమతి..

ఈ ఉమ్మడి కామన్ పాస్ వినియోగానికి సంబంధించి రవాణా శాఖ పలు కీలక పరిమితులను విధించింది. ఈ సదుపాయం కేవలం హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) పరిధిలో రాకపోకలు సాగించే టీజీఎస్ ఆర్టీసీ సిటీ బస్సులకు మాత్రమే చెల్లుబాటు అవుతుంది.



ని స్పష్టం చేశారు. అదే సమయంలో శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి రాకపోకలు సాగించే ప్రత్యేక పుష్పక్ ఏసీ బస్సులలో ప్రయాణించేందుకు ఈ కామన్ పాస్ ఏమాత్రం వర్తించదని అధికారులు తేల్చిచెప్పారు. సిటీ బస్సులు, మెట్రో రైళ్లలో నిత్యం ప్రయాణించే ఉద్యోగులు, చిరు వ్యాపారులకు ఈ ధరల తగ్గింపు ఎంతో ఊరటనివ్వనుంది.

స్మార్ట్ కార్డుకు రూ. 100 సెక్యూరిటీ డిపాజిట్..

కామన్ పాస్‌లను ఉపయోగించే ప్రయాణికులకు ప్రత్యేక స్మార్ట్ కార్డ్ రూపంలో అందజేయనున్నారు. మొదటిసారి ఈ కార్డును కొనుగోలు చేసే సమయంలో ప్రయాణికులు రూ. 100 వన్‌టైమ్ సెక్యూరిటీ డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుంది. భవిష్యత్తులో కార్డు అవసరం లేదనుకుని తిరిగి అప్పగిస్తే నిబంధనల ప్రకారం ఆ డిపాజిట్ సొమ్మును రీఫండ్ చేస్తారు. ఈ ఉమ్మడి స్మార్ట్ కార్డులను కొత్తగా కొనుగోలు చేయడం, రీఛార్జ్ చేసుకోవడం కేవలం హైదరాబాద్ మెట్రో రైల్ స్టేషన్లలోని టికెటింగ్ కౌంటర్ల వద్ద మాత్రమే సాధ్యమవుతుందని అధికారులు స్పష్టం చేశారు.

కార్డు పోయినా, దొంగిలించబడినా ప్రయాణికుడిదే బాధ్యత..

పాస్ చెల్లుబాటు విషయానికొస్తే వన్ డే పాస్ కొనుగోలు చేసిన క్యాలెండర్ రోజు మాత్రమే పనిచేస్తుందని, మంత్లీ పాస్ కొనుగోలు చేసిన తేదీ నుంచి సరిగ్గా 30 రోజుల పాటు మాత్రమే వర్తిస్తుందని అధికారులు తెలిపారు. ఒకసారి కొనుగోలు చేసిన తర్వాత పాస్ విలువకు ఎలాంటి రీఫండ్ ఉండదని, డే పాస్‌ను మంత్లీ పాస్‌గా మార్చుకునే అవకాశం లేదని పేర్కొన్నారు. ఒకవేళ కార్డు పోయినా లేదా దొంగిలించబడినా పూర్తిగా ప్రయాణికుడే బాధ్యత వహించాలని, కార్డులోని బ్యాలెన్స్ లేదా డిపాజిట్‌కు హైదరాబాద్ మెట్రో రైల్ లేదా టీజీఎస్ ఆర్టీసీ యాజమాన్యాలు ఎలాంటి రీఫండ్ ఇవ్వబోవని స్పష్టం చేశారు.

కలం జ్యోతి
తెలుగు దినపత్రిక
శనివారం 07.11.2026
4
www.kalamjyothi.com



రాష్ట్రంలో ఉన్నది రేవంత్ వృష్టి

మాజీ మంత్రి హరీష్‌రావు



కలంజ్యోతి, నర్సాపూర్ (నవంబర్ 07) : తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్నది అతివృష్టి, అనావృష్టి కాదని, కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థ పాలన తెచ్చిన ముమ్మాటికీ రేవంత్ వృష్టేనని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. నర్సాపూర్ నియోజకవర్గ పరిధిలోని హత్నూర మండలం తెలరాళ్ల తండా, నస్తీపూర్ గ్రామాల్లో చేతికొచ్చే దశలో ఎండిపోయిన వరి పంటలను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సాగునీరు, నిరంతర విద్యుత్ లేక రైతాంగం తీవ్ర ఇబ్బందులు పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అడుగంటిన జలాశయాలతో పంటలు కాపాడుకోలేక రైతులు కన్నీరుమున్నీరవుతున్నారని, ఎన్నో ప్రయత్నాలు చేసినా ఫలితం లేకుండా పోతోందన్నారు. రైతుల పెట్టుబడులు మునిగిపోయి ఆత్మహత్యలకు పాల్పడే దయనీయ పరిస్థితులు దాపురించాయని, సీఎం రేవంత్ రెడ్డి రైతుల పట్ల దొంగ ప్రేమ ప్రదర్శిస్తున్నారని మండిపడ్డారు.

మిగతా గోదావరి నీళ్లను పట్టిసీమకు వదిలేశారు..

నదుల్లో సమృద్ధిగా నీరు ఉన్నప్పటికీ ఎత్తిపోతల మోటార్లు ఆన్ చేయకుండా పంటలను ఎండబెట్టిన అసమర్థ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని దుయ్యబట్టారు. దేవాదుల ప్రాజెక్టు ద్వారా 60 టీఎంసీల నీటిని ఎత్తిపోసే అవకాశం ఉన్నప్పటికీ కేవలం 18 టీఎంసీలే ఎత్తి, మిగిలిన గోదావరి నీళ్లను చంద్రబాబు పట్టిసీమకు తరలించుకుపోయేలా వదిలేశారని ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 25 లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోతుంటే క్యాబినెట్ సమావేశంలో ఒక్క మాట కూడా మాట్లాడకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వానికి గ్లోబల్ సమ్మిట్‌పై ఉన్న ప్రేమ, శ్రద్ధ రైతుల గోడుపై ఎందుకు లేదని నిలదీశారు. కొడంగల్ నియోజకవర్గానికి రూ. 9 వేల కోట్ల రోడ్లకు, లక్ష కోట్ల రూపాయల ఫ్యూచర్ సిటీకి పైసలుంటాయి కానీ, ఎండిన పంటలకు నష్టపరిహారం ఇచ్చేందుకు నిధులు లేవా అని సూటిగా ప్రశ్నించారు.

ఎకరానికి రూ. 5 వేల సాయం ఇవ్వాలి..

మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల తరహాలోనే పంట నష్టపోయిన రైతాంగానికి తక్షణమే ఎకరానికి రూ. 5,000 చొప్పున కరువు సాయం ప్రకటించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అసెంబ్లీ బడ్జెట్‌లో రూ. 1600 కోట్లు కేటాయించామని గొప్పగా బల్లలు చరిచిన పాలకులు, మూడేళ్లు గడుస్తున్నా పంటల బీమా పథకాన్ని అమలు చేయకుండా రైతుల గుండెలపై తన్నారని మండిపడ్డారు. గత కేసీఆర్ ప్రభుత్వం రైతులకు కొండంత అండగా నిలిపిన రైతుబీమాను అర్ధాంతరంగా ఆపేసి, ఇందిరమ్మ బీమా పేరుతో నవంబర్ 19 నుంచి మళ్లీ దరఖాస్తులు తీసుకుంటామంటూ ప్రభుత్వం చావు కబురు చల్లగా చెబుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీని అబద్ధాల అడ్డాగా మార్చిన ముఖ్యమంత్రి, బడ్జెట్‌లో ప్రకటించిన రాజీవ్ యువ వికాసం, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలను ఎందుకు గాలికొదిలేశారో సమాధానం చెప్పాలన్నారు.

సన్నాలకు బోనస్ ఎగ్గొట్టేందుకే కొనుగోళ్లలో జాప్యం..

ఇప్పటిదాకా మాటలతో మభ్యపెట్టిన పాలకులు, నేడు రైతుబంధు ఖాతాల్లో పడ్డట్లు సీఎం పేరుతోనే ఫేక్ మెసేజ్‌లు పంపుతూ మోసం చేస్తున్నారని, దమ్ముంటే ఆ మెసేజ్‌లు పంపిన వారిపై కేసులు పెట్టి అరెస్ట్ చేయాలని సవాల్ విసిరారు. కళ్లాల్లోకి 30 శాతం ధాన్యం వచ్చినా ఇంతవరకు కొనుగోలు కేంద్రాలు తెరవకపోవడం వెనుక సన్న రకాలకు ఇచ్చే రూ. 500 బోనస్ ఎగ్గొట్టే కుట్ర దాగి ఉందన్నారు. ప్రభుత్వం పూర్తిస్థాయి రుణమాఫీ చేయకపోగా, బ్యాంకులు రైతుల వృద్ధాప్య పెన్షన్లు, ఇందిరమ్మ ఇళ్ల బిల్లులు, ధాన్యం అమ్మిన పైసలను క్రాప్ లోన్ కింద బలవంతంగా జమ చేసుకుంటున్నాయని ధ్వజమెత్తారు. సింగూరులో 20 టీఎంసీల నీళ్లను రిపేర్ల పేరుతో ఖాళీ చేసి నాలుగు జిల్లాల ప్రజల గొంతు ఎండబెట్టారని, ప్రజల తాగునీటిని ఆపేసి బీరు ఫ్యాక్టరీలకు నీళ్లు తరలిస్తున్నారని మండిపడ్డారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలో మళ్లీ కేసీఆర్ ప్రభుత్వం రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత రెడ్డి, సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్, హత్నూర మండల్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రామచంద్ర రెడ్డి, మాజీ ఎంపీపీ నర్సింలు, మాజీ జెడ్పీటీసీ ఆంజనేయులు, నస్తీపూర్ సర్పంచ్ ప్రమీల, నస్తీపూర్ ఉపసర్పంచ్ మహేందర్ పటేల్, హత్నూర మండల్ మాజీ బీఆర్ఎస్ యువజన అధ్యక్షుడు మధు పటేల్, కోఆపరేటివ్ సొసైటీ డైరెక్టర్ కృష్ణ, దౌల్తాబాద్ ఉపసర్పంచ్ శేఖర్ గౌడ్, కిషోర్, ఇబ్రహీం, సాజిద్, బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు, ఆయా గ్రామాల సర్పంచులు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.





దళారులను ఆశ్రయించి మోసపోవద్దు

- కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి
- ఏఎంసీ చైర్మన్ సాహిత్య వినయ్ కుమార్

కలంజ్యోతి, ఇల్లంతకుంట (నవంబర్ 06) : రైతులు దళారులను ఆశ్రయించి మోసపోకుండా, ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకొని మద్దతు ధర పొందాలని ఇల్లంతకుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అంతగిరి సాహిత్య వినయ్ కుమార్ పిలుపునిచ్చారు. మండల పరిధిలోని మానేరెడ్డిపల్లె, కందికట్కూర్, కిష్టారావుపల్లె, గూడెంపల్లె, చిక్కుడువానిపల్లె, తెనుగువానిపల్లె, ఇల్లంతకుంట, తాళ్లపల్లి గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయా గ్రామాల సర్పంచులు, మార్కెట్ కమిటీ సభ్యులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు తమ ధాన్యాన్ని ప్రభుత్వ కేంద్రాల్లోనే విక్రయించాలని, కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని మౌలిక సౌకర్యాలు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం కుమారస్వామి, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు మామిడి రాజు, వైస్ చైర్మన్ భరత్ రెడ్డి, ఏపీఓ ప్రవీణ్, ఏఈఓలు అర్చన, మౌనిక, అభిషేక్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు నవీన్ రెడ్డి, బంగారి ఆంజనేయులు, బడుగు లింగయ్య, వర్కుల మల్లయ్య, ఎరుకల తిరుపతి, జుట్టు నగేష్, సర్పంచులు మర్కటి లావణ్య రవి, జక్కుల మల్లవ్వ, చిక్కుడు కళ్యాణ్, గూడెల్లి స్వప్న, సత్యం, వాడే చంద్రారెడ్డి, సింగిరెడ్డి రచన, వెంకటరమణారెడ్డి, విజయ్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ యాస తిరుపతి, డైరెక్టర్ అనిల్, ఉపసర్పంచుల ఫోరం అధ్యక్షుడు రామస్వామి, ఐకేపీ సీసీలు రాజేశ్వరి, రామచంద్రారెడ్డి, విటల్ రెడ్డి, వెంకన్న, రామచంద్రం, జిల్లా అధ్యక్షురాలు కట్ట సౌమ్య, వీఓ అధ్యక్షురాలు బొంగోని లలిత, సీనియర్ కాంగ్రెస్ నాయకులు పసుల వెంకన్న, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ప్రసాద్, ఆయా గ్రామాల ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు, నాయకులు, మహిళా సంఘాల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు సబ్సిడీ పథకాలు అందాలి

కలెక్టర్ భవేష్ మిశ్రా



కలం జ్యోతి, నిర్మల్ (నవంబర్ 06) : బ్యాంకులు ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతో పాటు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న రుణ, సబ్సిడీ పథకాలను అర్హులైన లబ్ధిదారులకు చేరవేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా బ్యాంకింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రజల ఆర్థిక అభివృద్ధికి బ్యాంకులు మరింత చొరవ చూపాలని సూచించారు. ప్రభుత్వ పథకాల ద్వారా అందించే రుణాలను అర్హులకు సకాలంలో మంజూరు చేయాలని, తద్వారా ప్రజల ఆర్థిక స్వావలంబనకు తోడ్పడాలని అన్నారు. ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావంతో వ్యవసాయ రంగంలో ప్రతికూల పరిస్థితులు నెలకొంటున్న నేపథ్యంలో రైతులకు వ్యవసాయ రుణాలు, ఇతర సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వాలు రైతుల సంక్షేమం కోసం రూపొందిస్తున్న విధానాలు, పథకాలపై క్షేత్రస్థాయిలో విస్తృత అవగాహన కల్పించాలన్నారు. రైతులకు మారటోరియం అంశంపై స్పష్టమైన అవగాహన కల్పించి అవసరమైన బ్యాంకింగ్ సేవలు అందుబాటులో ఉండేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు వెంకట మాధవరావు, రాథోడ్ రమేష్, జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ రామ్ గోపాల్, ఆర్బీఐ ఏజీఎం రాములు, నాబార్డు డీడీఎం అబ్దుల్ రవూఫ్, వివిధ బ్యాంకుల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కలంజ్యోతి

తెలుగు దినపత్రిక

5

శనివారం 07.11.2026

www.kalamjyothi.com



అక్రమ మద్యం షాపును సీజ్ చేయాలి

- అధికారులపై విచారణ జరిపి సస్పెండ్ చేయాలి
- డివిజన్ వ్యాప్తంగా సమగ్ర తనిఖీలు చేపట్టాలి
- సీపీఐ (ఎంఎల్) నాయకుల డిమాండ్

కలంజ్యోతి, నర్సంపేట (నవంబర్ 06) : దుగ్గొండి మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీనరసింహ స్వామి బ్రాందీ షాపులో సాగుతున్న అక్రమ మద్యం విక్రయాలపై సమగ్ర విచారణ జరిపి, సదరు దుకాణాన్ని తక్షణమే సీజ్ చేయాలని సీపీఐ (ఎంఎల్) నాయకులు డిమాండ్ చేశారు. సంబంధిత బ్రాందీ షాపులో అక్రమ మద్యం నిల్వలు బయటపడినప్పటికీ చర్యలు తీసుకోకుండా వదిలేసిన జిల్లా టాస్క్‌ఫోర్స్ ఎక్సైజ్ సీఐతో పాటు ఇద్దరు కానిస్టేబుళ్లపై విచారణ చేపట్టి వెంటనే సస్పెండ్ చేయాలని కోరారు. ఈ మేరకు శుక్రవారం సీపీఐ (ఎంఎల్) పార్టీ ఆధ్వర్యంలో నర్సంపేట ఆర్డీఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఖమ్మం, వరంగల్ జిల్లాల పరిధిలోని ఇతర బ్రాందీ షాపుల నుంచి తక్కువ ధరకు మద్యం కొనుగోలు చేసి ఇక్కడ అక్రమంగా విక్రయిస్తున్నారని తెలిపారు. టాస్క్‌ఫోర్స్ అధికారులు తనిఖీలు నిర్వహించి అక్రమ నిల్వలను గుర్తించినప్పటికీ, నిర్వాహకులపై కేసులు నమోదు చేయకుండా మద్యం బాటిళ్లను బయటకు తరలించేందుకు సహకరించారనే తీవ్ర ఆరోపణలు వస్తున్నాయని, ఈ వ్యవహారంలో అధికారుల పాత్రపై ఉన్నతాధికారులు నిష్పక్షపాతంగా విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

డివిజన్ వ్యాప్తంగా సమగ్ర తనిఖీలు చేపట్టాలి..

నర్సంపేట డివిజన్ పరిధిలోని గిర్నిబావితో పాటు పలు మండలాల్లో ఉన్న వైన్ షాపుల్లోనూ పెద్దఎత్తున అక్రమ మద్యం వ్యాపారం సాగుతోందని నాయకులు ఆరోపించారు. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలకు విరుద్ధంగా ఇతర ప్రాంతాల నుంచి అక్రమ మద్యాన్ని తీసుకొచ్చి విక్రయిస్తూ ప్రజల ఆరోగ్యాలతో వ్యాపారులు చెలగాటమాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులు ప్రత్యేక బృందాలతో డివిజన్ వ్యాప్తంగా అన్ని బ్రాందీ షాపుల్లో సమగ్ర తనిఖీలు చేపట్టి అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని, ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే మద్యం వ్యాపారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) రాష్ట్ర నాయకులు కామ్రేడ్ మోడం మల్లేశం, కామ్రేడ్ భూమా అశోక్, కామ్రేడ్ అనిల్, భిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

గో-కార్ట్ రేసింగ్‌లో దీక్షిత్ దూకుడు

విద్యార్థుల విజయాలే పాఠశాలకు గుర్తింపు : చైర్మన్ చింతల నరేందర్



కలంజ్యోతి, నర్సంపేట (నవంబర్ 06) : రేసింగ్ ట్రాక్‌పై వేగం, పట్టుదలతో అద్భుత ప్రతిభ కనబరిచిన నర్సంపేట డఫోడిల్స్ పాఠశాల విద్యార్థి తంగెళ్ల దీక్షిత్ గోకార్ట్ రేసింగ్ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచి సత్తా చాటాడు. కవాసకి రేసింగ్ టీమ్ ఆధ్వర్యంలో నిర్వహించిన 2026 సీజన్ అండర్ 18 గో కార్ట్ రేసింగ్ జిల్లా స్థాయి పోటీల్లో దీక్షిత్ అత్యుత్తమ డ్రైవింగ్ నైపుణ్యాన్ని ప్రదర్శించాడు. కేవలం 23.83 సెకన్లలోనే ఫాస్టెస్ట్ ల్యాప్ పూర్తి చేసి రికార్డు నమోదు చేయడంతో పాటు ప్రథమ బహుమతి కింద రూ. 2 లక్షల నగదు పురస్కారాన్ని కైవసం చేసుకున్నాడు. ఈ అద్భుత విజయంతో అండర్ 18 రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించి రాష్ట్రస్థాయికి అర్హత సాధించడంతో పాఠశాల ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు తీవ్ర హర్షం వ్యక్తం చేశారు.

విద్యార్థుల విజయాలే గుర్తింపు: నరేందర్..

విద్య అంటే కేవలం పుస్తకాలు, మార్కులకే పరిమితం కాకుండా క్రీడలు, సైన్స్, టెక్నాలజీ రంగాల్లోనూ విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని డఫోడిల్స్ పాఠశాల చైర్మన్ చింతల నరేందర్ పేర్కొన్నారు. ప్రతి విద్యార్థిలో దాగివున్న సహజ సిద్ధమైన ప్రతిభను గుర్తించి సరైన మార్గదర్శకత్వం, తగిన అవకాశాలు కల్పిస్తే అద్భుత విజయాలు సాధిస్తారని తెలిపారు. తమ పాఠశాల విద్యార్థి తంగెళ్ల దీక్షిత్ 23.83 సెకన్లలోనే ఫాస్టెస్ట్ ల్యాప్ పూర్తి చేసి రూ. 2 లక్షల నగదు బహుమతి గెలుపొందడం పాఠశాలకే గర్వకారణమన్నారు. కేవలం పరీక్షల్లో ఉత్తీర్ణులు కావడమే కాకుండా, సమాజంలో తమకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకునే విజేతలుగా విద్యార్థులను తీర్చిదిద్దడమే పాఠశాల ముఖ్య సంకల్పమని స్పష్టం చేశారు.



కోతుల స్వైరవిహారం

- పగలు, రాత్రి తేడా లేకుండా వీధుల్లో గుంపులు
- చిన్నపిల్లలు, వృద్ధులపై దాడులతో తీవ్ర భయాందోళన
- అధికారులు స్పందించి కోతుల బెడదను నివారించాలి

కలంజ్యోతి, చెన్నారావుపేట (నవంబర్ 05) : చెన్నారావుపేట మండల కేంద్రంలోని చెన్నారావుపేట, పాత మగ్దూపురం పరిసరాల్లో కోతుల బెడద రోజురోజుకూ తీవ్రరూపం దాల్చుతోంది. పగలు, రాత్రి అనే తేడా లేకుండా కోతుల గుంపులు విచ్చలవిడిగా వీధుల్లో సంచరిస్తూ స్థానిక ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ముఖ్యంగా రాత్రి వేళల్లో ప్రధాన రహదారులు, అంతర్గత వీధుల్లో కోతులు గుంపులుగా చేరి స్వైరవిహారం చేస్తుండటంతో స్థానికులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. ఇళ్ల పరిసరాలు, వీధులు, రోడ్లపైకి గుంపులు గుంపులుగా దూసుకొస్తుండటంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే వణికిపోతున్నారు.

చిన్నపిల్లలు, వృద్ధులపై దాడులతో తీవ్ర భయాందోళన..

కోతుల స్వైరసంచారంతో చిన్నపిల్లలు, వృద్ధులు రోడ్లపై నడవలేని దుస్థితి నెలకొంది. వీధుల్లో వెళ్లే పాదచారులపైకి ఆకస్మికంగా దూసుకెళ్లి దాడి చేస్తుండటంతో ప్రజలు బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. మరోవైపు రాత్రి వేళల్లో రహదారుల మధ్యలో గుంపులుగా తిష్ట వేస్తుండటంతో ద్విచక్ర వాహనదారులు, ఇతర ప్రయాణికులు తీవ్ర ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోతుల వికృత చేష్టల వల్ల మండల కేంద్రంలోని ప్రజల నిత్యజీవితం తీవ్ర నరకప్రాయంగా మారిందని వాపోతున్నారు.



అధికారులు స్పందించి కోతుల బెడదను నివారించాలి..

గ్రామంలో కోతుల బెడద తీవ్రస్థాయికి చేరిన ప్పటికీ సంబంధిత అధికారులు సమస్యను పట్టించుకోకపోవడంపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా పంచాయతీ, అటవీ శాఖ ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి ప్రత్యేక చర్యలు చేపట్టాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. గ్రామంలో స్వైరవిహారం చేస్తున్న కోతుల గుంపులను బంధించి సురక్షితమైన అటవీ ప్రాంతాలకు తరలించాలని కోరుతున్నారు. ప్రజలకు నిరంతర రక్షణ కల్పిస్తూ, కోతుల బెడద నుంచి శాశ్వత విముక్తి కలిగించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.







కలం జ్యోతి
తెలుగు దినపత్రిక

నైట్ టీషర్‌తో రోడ్డుపైకి పరిగెత్తి..

గతంలో తన భర్త సైఫ్ అలీఖాన్‌పై ఇంట్లోకి చొరబడిన దుండగుడు కత్తితో దాడి చేసినప్పుడు, రక్తమోడుతున్న ఆయనను ఆసుపత్రికి చేర్చేందుకు తాను నైట్ టీషర్ట్‌తోనే రోడ్డుపైకి పరిగెత్తి వెళ్లానని అప్పుడు సాయం కోసం కేకలు వేశానని నటి కరీనా కపూర్ తెలిపారు. ఇంట్లో డ్రైవర్లు ఎవరూ లేకపోవడంతో ఆ భయానక రాత్రి వేళ అటుగా సినిమా సన్నివేశంలా మారిందని, అదృష్టవశాత్తూ ఆ సమయంలో ఎవరి వద్దా ఫోన్లు లేక వీడియోలు తీయలేదని పేర్కొన్నారు. ఆ తీవ్ర దాడి ఘటన తమ కుటుంబంపై తీవ్ర మానసిక ప్రభావాన్ని చూపిందని, ఆ జ్ఞాపకాలతో దాదాపు ఆరు నెలల పాటు నిద్రలేని రాత్రులు గడపాల్సి వచ్చిందని ఈ సందర్భంగా సైఫ్, కరీనా దంపతులు వెల్లడించారు.

Printed and Published by PENDYALA JYOTHI on behalf of PENDYALA JYOTHI, Printed at Rudra Kakatiya Printers and Graphics H.no.183/85/12/38, Somidi Road, Kazipet, Warangal, 506003., Published at H.No. 30/1/426, Madikonda, Kazipet, Hanumakonda District. Telangana, 506142, Editor : RAMESH PENDYALA. Ph : 9494 009 003.